
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



## వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

శనివారం 29 నవంబరు 2025


## నాగసార్ ఏకగ్రీవం?

దౌల్తాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసార్ గ్రామ పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవం కానున్నట్లు తెలుస్తోంది. గ్రామ హనుమాన్ ఆలయ పునర్నిర్మాణం కోసం రూ.20 లక్షలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే కాంగ్రెస్ బలపరిచే అభ్యర్థి ఏకగ్రీవం కానున్నట్లు తెలుస్తోంది. గ్రామంలో మొత్తం 679 మంది ఓటర్లు ఉన్నారు.



## పరిశీలన

హైదరాబాద్- బీజాపూర్ హైవే విస్తరణ పనులను శుక్రవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. ముడిమ్యాల- మన్నెగూడ మధ్యలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన ఆసక్తితో కాసేపు హిటాచీ యంత్రం నడిపారు. -పూడూరు, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి)



మంబాపూర్‌లో నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలి

### అధికారులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచన

పెద్దేముల్/యాలాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి, మంబాపూర్, కందనెల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేసే సమయంలో కావాల్సిన ధ్రువపత్రాల వివరాలను అభ్యర్థులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు తీసుకోవాలన్నారు. అభ్యర్థులకు వ్యయాలకు సంబంధించి ప్రత్యేక బ్యాంకు ఖాతాలు ఉండాలని చెప్పారు. సర్పంచ్, వార్డు సభ్యులు నిబంధనలకు అనుగుణంగానే ఖర్చులు పెట్టాలనే విషయం అభ్యర్థులకు వివరించాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. అలాగే యాలాల మండల పరిధిలోని కోకట్ క్లస్టర్‌లో కోకట్, బషీర్‌మియాతండా పంచాయతీలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను సైతం కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ఫారాలను స్పష్టం చూసి వాటిలో ఏవైనా తప్పులు ఉంటే సరి చేసుకునే విధంగా అభ్యర్థులకు సహకరించాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో శ్రీనిజ, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.



పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేస్తున్న ప్రతీ పైసాకు లెక్క పక్కాగా చెప్పాల్సిందే.. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ ఖర్చులను పరిశీలించేందుకు ఎన్నికల వ్యయ పరిశీలకులను నియమించారు. బరిలో ఉండే అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రలోభాలు, పదవుల వేలం నిర్వహణ మొదలుకుని పోటీలో ఉండే సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల ప్రచార వ్యయాల వరకు నిశితంగా పరిశీలించనున్నారు.

# లెక్క చెప్పాల్సిందే!

### ఎన్నికల ఖర్చులు పక్కాగా ఉండాల్సిందే

మండలాల వారీగా ఎన్నికల వ్యయ పరిశీలకులు

వ్యయ పరిమితి మించితే అభ్యర్థులపై వేటే

5వేల జనాభాపైన ఉంటే సర్పంచ్‌లకు రూ. 2. 5లక్షలు

అంతకు తక్కువ ఉన్నచోట రూ. 1. 5లక్షలుగా నిర్ణయం

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో తొలి విడతలో తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని 8 మండలాల్లో 262 గ్రామ పంచాయతీలకు, 2,198 వార్డులకు వచ్చేనెల 11న పోలింగ్ జరగనుంది. గురువారం ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శనివారంతో ముగియనుంది. ఇప్పటికే ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమన్న అభ్యర్థులు గుర్తులు కేటాయించకున్నా ప్రచారం ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యులకు వేర్వేరుగా వ్యయ పరిమితి నిర్ణయించారు. ఐదు వేలకుపైగా జనాభా ఉన్న పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులకు రూ.2.50లక్షలు, వార్డు సభ్యుల

మిగతా 8వ పేజీలో...

## ఏకగ్రీవాలపై విచారణ




ఇదిలా ఉంటే, తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో పట్టు ఉన్న నేతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు పావులు కదుపుతున్నారు. పెద్దేముల్, దౌల్తాబాద్ మండలాల్లో ఇప్పటికే పలు పంచాయతీల్లో సర్పంచులతో పాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కసరత్తు కొనసాగుతోంది. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లాలో ఏకగ్రీవ పంచాయతీలు, వార్డుల వివరాలను కోరనుంది. ఒక స్థానానికి ఒకే అభ్యర్థి నామినేషన్ వేసిన పక్షంలో అక్కడ పదవుల వేలం, ఒత్తిడి, ప్రేరణ, బెదిరింపు, బలవంతపు ఉప సంహరణలు జరిగినట్లు ఏమైనా ఫిర్యాదులు వస్తే విచారణ జరపనున్నారు. విచారణలో నిజమని తేలితే ఫలితాలు ప్రకటించొద్దని రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించింది. ఫిర్యాదులు రాని పక్షంలో నామినేషన్లు ఉప సంహరించుకున్నా.. ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థులతో స్వీయ ధ్రువీకరణ పత్రాలు రాయించుకున్న తర్వాతనే ఫలితాలు వెల్లడించాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే, ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో నామినేషన్లు ఉపసంహరించుకున్న అభ్యర్థులు స్వచ్ఛందంగా తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుంటున్నానని స్వీయ ధ్రువీకరణ పత్రం అందజేయాల్సి ఉంటుంది.

## పక్కాగా ఎన్నికల పర్యవేక్షణ

### 12 మంది నోడల్ అధికారుల నియామకం



వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల పర్యవేక్షణను పకడ్బందీగా చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు 12 అంశాలకు సంబంధించి వివిధ శాఖల జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. జిల్లా స్థాయిలో వివిధ కార్యకలాపాలు నిర్వర్తించే విధంగా బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు వీరికి శిక్షణ కూడా ఇప్పించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నోడల్ అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది.

జిల్లా నోడల్ అధికారులు, బాధ్యతలు...

| నోడల్ అధికారి | హోదా | బాధ్యతలు |
|---|---|---|
| మంగీలాల్ | జిల్లా రెవెన్యూ అధికారి | బ్యాలెట్ పేపర్లు |
| డాక్టర్ పి.జయసుధ | జిల్లా పంచాయతీ అధికారి | బ్యాలెట్ బాక్సుల నిర్వహణ |
| జి.రేణుకాదేవి | జిల్లా విద్యాశాఖ అధికారి | మానవశక్తి నిర్వహణ |
| వెంకటరెడ్డి | జిల్లా రవాణా శాఖ అధికారి | రవాణా |
| మాధవరెడ్డి | జిల్లా బీసీ అభివృద్ధి అధికారి | శిక్షణ |
| పి.కమలాకర్‌రెడ్డి | జిల్లా గిరిజన సంక్షేమాధికారి | సామగ్రి నిర్వహణ |
| ఎన్.జేమ్స్‌న్ కుమార్ | జిల్లా ట్రెజరీ అధికారి | ఎంసీసీ, వ్యయ ఖాతాలు |
| కె.నాగార్జున | జిల్లా సహకార అధికారి | వ్యయ పర్యవేక్షణ |
| జి.జ్ఞానేశ్వర్ | జిల్లా అటవీ అధికారి | పరిశీలకులు |
| చెన్నమ్మ | జిల్లా ప్రజా సంబంధాల అధికారి | మీడియా కమ్యూనికేషన్ |
| ఎంఏ సత్తార్ | జిల్లా ఉద్యాన పట్టు అధికారి | హెల్ప్‌లైన్ ఫిర్యాదులు |
| జి.వెంకటేశ్వర్లు | జిల్లా ప్రణాళిక అధికారి | నివేదికల సమర్పణ |

## మానసిక దివ్యాంగులను ఆదరించాలి

### అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



దివ్యాంగులతో మాట్లాడుతున్న రాధికాగుప్తా

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సమాజంలో దివ్యాంగులను ఆదరించాలని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ దివ్యాంగుల పునరావాస కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె దివ్యాంగులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో రికార్డులను పరిశీలించి అనంతరం దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని, వారిని ఆదరించాలన్నారు. ప్రస్తుతం 110 మంది దివ్యాంగులు ఉన్నారని, వారికి అసరమైన స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ మరింత బలోపేతం చేస్తామన్నారు. దివ్యాంగులకు అందాల్సిన పింఛన్లపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరగా అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దివ్యాంగులను కేంద్రానికి తరలించడానికి ఆటో, భవనానికి మరమత్తులు, దివ్యాంగుల ఆటసామగ్రి కావాలని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కేంద్రానికి వచ్చే రోడ్డు దారుణంగా ఉందని వెంటనే సీసీ రోడ్డు వేసే విధంగా చూడాలని దివ్యాంగుల తల్లిదండ్రులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాంబశివరావు, డీపీఎం ఆనంద్ , ఏపీఎం మునుస్వామి, ఎంఎస్ఎవోబీ లలిత, స్థానిక దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు బట్టి రవి, సీసీల, దివ్యాంగులు వారి తల్లిదండ్రు లు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణవేణి

## దివ్యాంగులు స్ఫూర్తి ప్రదాతలు

- దివ్యాంగుల సంక్షేమ జిల్లా అధికారి కృష్ణవేణి

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తూ స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తున్నారని దివ్యాంగుల సంక్షేమ జిల్లా అధికారి కృష్ణవేణి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి దివ్యాంగులకు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనియర్స్ సీనియర్స్ విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీల్లో అంధులకు రన్నింగ్, షాట్‌పుట్, చెస్, బధిరులకు రన్నింగ్, షాట్ పుట్, జావెలిన్ త్రో, శారీరక దివ్యాంగులకు క్యారమ్, షాట్‌పుట్ , జావెలిన్ త్రో, బుద్ధి మాంద్యం ఉన్న వారికి రన్నింగ్, షాట్ పుట్ తదితర క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ కాంతారావు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బంది, పీఈటీలు, దివ్యాంగులు హాజరయ్యారు.

## ఊపందుకున్న నామినేషన్లు

### రెండో రోజు సర్పంచ్ పదవులకు 341.. వార్డు సభ్యులకు 436 నామినేషన్లు

### నేటితో ముగియనున్న తొలి విడత నామినేషన్ల స్వీకరణ



మేడిచెట్టు తండాలో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న రవినాయక్

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తొలి విడత పంచాయతీ ఎన్నికల కోసం కొనసాగుతున్న నామినేషన్ల పర్వం రెండో రోజు ఊపందుకుంది. తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాల్లో శుక్రవారం వరకు సర్పంచ్ స్థానాలకు 341 నామినేషన్లు రాగా, వార్డులకు 436 నామినేషన్లు వచ్చాయి. జిల్లాలో సర్పంచ్ పదవులకు అత్యధికంగా పెద్దేముల్, యాలాల్, దౌల్తాబాద్ మండలాల్లో నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే అత్యల్పంగా బొంరాస్‌పేట్, దుద్యాల్ మండలాల్లో దాఖలయ్యాయి. దుద్యాల్ మండలంలో 25 నామినేషన్లు దాఖలు కాగా, బొంరాస్‌పేట్ మండలంలో 26 నామినేషన్లు మాత్రమే వచ్చాయి.

#### నేడే ఆఖరు...

నామినేషన్లు దాఖలు చేసేందుకు శనివారం ఆఖరు రోజు కావడంతో అధిక సంఖ్యలో నామినేషన్లు వచ్చే అవకాశం ఉంది. సాయంత్రం 5 గంటల వరకు ఆశావహులు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. 30న నామినేషన్లు పరిశీలించిన అర్హులైన అభ్యర్థుల జాబితా సాయంత్రం 5 గంటల తరువాత ప్రకటిస్తారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబరు ఒకటో తేదీ సాయంత్రం 5 గంటలలోగా తెలియజేయాల్సి ఉంటుంది. 2వ తేదీ, సాయంత్రం 5 గంటలలోగా వాటిని పరిష్కస్తారు.

రెండు రోజుల్లో వచ్చిన నామినేషన్లు

| మండలం | పంచాయతీలు | నామినేషన్లు | వార్డులు | నామినేషన్లు |
|---|---|---|---|---|
| తాండూరు | 33 | 40 | 290 | 53 |
| బషీరాబాద్ | 39 | 38 | 312 | 28 |
| యాలాల | 39 | 56 | 318 | 40 |
| పెద్దేముల్ | 38 | 67 | 308 | 112 |
| కొడంగల్ | 25 | 38 | 222 | 64 |
| దౌల్తాబాద్ | 33 | 51 | 290 | 65 |
| బొంరాస్‌పేట్ | 35 | 26 | 292 | 49 |
| దుద్యాల్ | 20 | 25 | 166 | 25 |
| మొత్తం | 262 | 341 | 2,198 | 436 |




యథేచ్ఛగా అక్రమ లేఅవుట్ 8

కూల్చివేసినా మారని తీరు

మరోసారి హద్దురాళ్లు ఏర్పాటు

నాపరాతి పరిశ్రమ అభివృద్ధికి కృషి 7

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


## సేవలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణకుమారి

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నమోదు పొందిన అన్ని ప్రైవేటు ఆస్పత్రులు తమ సేవలను సమయానుసారం పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజువారీగా పేషంట్ వివరాలు, చికిత్సలు, ల్యాబ్ రిపోర్టులు ఐహెచ్ఐపీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ఆసుపత్రుల్లోని సదుపాయాలు, సిబ్బంది వివరాలు, వైద్యుల అర్హతలు వంటి అంశాలను సైతం హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో ప్రతీ నెల అప్‌డేట్ చేయాలని సూచించారు. ఈ డేటా ఆధారంగా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్న ఆసుపత్రులు, ల్యాబ్‌లను గుర్తించి జరిమానాలు విధించి సీజ్, అలాగే అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రామ్ అధికారులు, జిల్లా ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిగిలోని పత్తి మిల్లులో..

## కొనుగోళ్లలో జాప్యం.. దళారుల ఇష్టారాజ్యం

### పత్తిని విక్రయించేందుకు రైతుల పాట్లు

సీసీఐ కేంద్రాల్లో నిబంధనల పేరిట కొర్రీలు

దీంతో బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు

సిండికేట్‌తో నిండా ముంచుతున్న దళారీలు

తూకాల్లోనూ వెలుగుచూస్తున్న మోసాలు

2లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

6

పరిగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కేంద్రాల్లో జాప్యం కారణంగా రైతులు దగాకు గురవుతున్నారు. ఈ సారి కురిసిన అధిక వర్షాలు పత్తిపంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఏదో చేతికొచ్చిన కొద్దిపాటి పంటను కూడా మద్దతు ధరకు అమ్ముకోలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, కోట్‌పల్లి, మర్పల్లి ప్రాంతాల్లో మొత్తం 14 కాటన్ మిల్లులు ఉన్నాయి. అయినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో పది కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ అక్కడ సైతం కొనుగోళ్లు నామమాత్రంగా సాగుతున్నాయి. దీనికి తోడు నిబంధనల పేరిట కొర్రీలు పెడుతూ ఆందోళనకు

మిగతా 8వ పేజీలో...

### దిక్కులేక బయట మార్కెట్‌కు..



నేను ఐదు ఎకరాల్లో పత్తిని సాగు చేశాను. అధిక వర్షాల వల్ల దిగుబడి లేక పెట్టుబడి రాని పరిస్థితి నెలకొంది. వచ్చిన కొద్దిపాటి పత్తిని అమ్ముకుందామని కాటన్ మిల్లుకు పోతే రకరకాల కొర్రీలు పెడుతున్నారు. నాణ్యత లేదని తక్కువ ధరకు కొంటామని చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్తే వారూ వింత సమాధానం ఇస్తున్నారు. దీంతో దిక్కులేక బయట మార్కెట్‌లో విక్రయించాల్సిన పరిస్థితి. ప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ.8,110 మద్దతు ధరను ఉన్నప్పటికి బయట దళారుల సిండికేట్ వల్ల రూ.7,500 అంతకంటే తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు.

-నారాయణ, రైతు, రాఘవాపూర్, పరిగి మండలం

## చౌడాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

చౌడాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ ఏఈ నవీన్ శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను చేపట్టాలన్నారు. మండలానికి 307 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు.



# కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి

**బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి**


మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

ఆమనగల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలు, వైఫల్యాలు ఎండగట్టి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మద్దతిచ్చిన అభ్యర్థుల విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికలు, పార్టీ బలోపేతం, సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించి కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ సత్తా చాటాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీల అమలుపై ఎన్నికల ప్రచారానికి గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. బీఆర్ఎస్ ప్రజా విశ్వాసం కోల్పోయిందని, గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కాల లక్ష్మణ్, సింగం శ్రీనయ్య, నాయకులు లక్ష్మణ్ రావు, శ్రీనివాస్, శ్రీను,మహేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తాం


మాట్లాడుతున్న అమెజాన్ సంస్థ ప్రతినిధి జాన్‌నోబెల్

యాచారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు అన్ని రకాల వసతులు కల్పించడానికి తమ వంతు సహకారమందిస్తామని అమెజాన్ సంస్థ ఆస్ట్రేలియా ప్రతినిధి జాన్‌నోబెల్ అన్నారు. శుక్రవారం యాచారం మండలంలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అమెజాన్ స్టీమ్ ల్యాబ్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని చదవాలని, నిర్దేశించుకున్న లక్ష్యం చేరడానికి ఉపాధ్యాయుల బోధన అందించాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. కార్యక్రమంలో అమెజాన్ సంస్థ స్థానిక ఉద్యోగులు లత, రాము, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామశాస్త్రి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు


ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

శంషాబాద్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సుల్తాన్‌పల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్‌లు దండు ఇస్తారి, యాటకారి సిద్దేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్ ముదిరాజ్, సుధాకర్, నరసింహ, శేఖర్‌తో పాటు మరికొంత మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, మల్లికార్జున్, వెంకటయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎన్నారై హైమద్‌షరీఫ్, చిత్రంలో మంత్రి అజారుద్దీన్ మాజీ ఎంపీ హనుమంతరావు, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

## టీపీసీసీ చీఫ్‌కు ఘన సన్మానం

శంషాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ రాజకీయాల్లో ఎంతో ఎత్తుకు ఎదిగారని ఫస్ట్‌డ్యూయెల్ సిటిజన్ అవార్డు గ్రహీత, స్థానిక ఎన్నారై ఇషైకార్‌హైమద్ షరీఫ్ అన్నారు. శంషాబాద్‌లోని తన నివాసంలో తన తన స్నేహితుడైన మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు మంత్రి అజారుద్దీన్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో పాటు రాజ్యసభ మాజీ సభ్యుడు హనుమంత్‌రావులను శుక్రవారం పూలమాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ భారతదేశంలో మతపరమైన విబేధాలుండవన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో గెలుపొందుతుందని ధీమావ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, దూడల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## టెట్ నుంచి మినహాయింపునివ్వాలి

**టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప**


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటప్ప

షాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. షాబాద్‌లో శుక్రవారం సంఘం మండల మహాసభలు శేఖర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలకు హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప మాట్లాడుతూ.. ఎన్‌సీటీఈ నోటిఫికేషన్ 23 ఆగస్టు 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. 30 ఏళ్లకు పైబడి సర్వీస్ చేసిన ఉపాధ్యాయులను రెండు సంవత్సరాల్లో టెట్ పాస్ కావాలని, లేని పక్షంలో ఉద్యోగం తొలగిస్తామని చెప్పడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

### కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సురేష్, మహిళా ఉపాధ్యక్షురాలిగా షహనాజ్, కోశాధికారిగా నయ్యర్, కార్యదర్శులుగా సుగుణ, స్వప్న, నర్సింహులు, హేమసుందర్, సంతోష్‌కుమార్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ అశోక్‌కుమార్, వీవోటీటీ కన్వీనర్‌గా నరేష్, ఆడిట్ కన్వీనర్‌గా కృపాకర్, క్రీడా కన్వీనర్‌గా రాజేశ్వరమ్మ, సాంస్కృతిక కన్వీనర్‌గా నర్సింహులు, పత్రిక కన్వీనర్‌గా జంగారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


ఇందిరమ్మ కాలనీలో ఆందోళన చేస్తున్న స్థానికులు

శంషాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కొందరు కబ్జా చేస్తున్నారని పలువురు స్థానికులు శుక్రవారం ఆందళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ కృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు నచ్చజెపే ప్రయత్నం చేశారు. కబ్జా చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టిన అక్రమార్కులపై చర్యలు తీసుకునే వరకూ మా పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఇళ్లు లేని పేదలు ఎంతో మంది ఉన్నారని, వారికి కాకుండా బిల్డింగ్‌లు కట్టుకున్న వారికి తిరిగి ప్లాట్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు స్పందించకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కబ్జా జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ హెచ్చరించారు. సోమవారం తహసీల్దార్‌తో కలిసి దర్యాప్తు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## గుప్త నిధుల వేట..
# ఎనిమిది మంది అరెస్టు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఎనిమిది మందిని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం ఇన్ఫోసిస్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో గుప్త నిధుల కోసం గుంతలు తవ్వుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా ఎనిమిది మంది యువకులు గుంతలు తవ్వుతూ కనిపించారు. ఆ గుంతల వద్ద కొబ్బరికాయలు, నిమ్మకాయలు కనిపించాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా గుప్త నిధుల కోసం తవ్వుతున్నట్లు తెలిపారు. కీసర మండలం రాంపల్లికి చెందిన గడిపల్లి మహేష్(3), గొలుసుల అజయ్(19), మిరియాల ప్రశాంత్(19), అమ్మనమంచి హర్ష(24), బీనగోని శివ(21), ఊర్సు శివ(19), బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి(20), బీగుడం అరవింద్(30)ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఎర్టిగ కారు, గవ్వలు, పూజా సామగ్రి, రెండు బైక్‌లు, ఎనిమిది సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




# 26 వార్డుల్లో ఎస్సీలకు నో చాన్స్




మొయినాబాద్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఉండగా 30,250 మంది ఓటర్లు ఉన్నారు. చేవెళ్ల డివిజన్ పరిధిలో రెండో విడత డిసెంబరు 14న పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. అయితే మండలం లోని మూడు పంచాయతీల్లో సర్పంచ్ పదవులతోపాటు మొత్తం 26 వార్డుల్లో ఎస్సీలకు ఒక్క వార్డు కేటాయించలేదు. ఇందులో కాశీంబౌళి, చందానగర్, కేతిరెడ్డిపల్లి ఉన్నాయి.

» కాశీంబౌళి సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించారు. ఎనిమిది వార్డుల్లో నాలుగు జనరల్, నాలుగు బీసీలకు కేటాయించారు. ఇందులో ఒక్క వార్డుకూడా ఎస్సీలకు కేటాయించలేదు. గ్రామంలో 994 ఓటర్లు ఉండగా ఎస్సీలు 25 మంది వరకు ఉంటారు.

» చందానగర్ పంచాయతీ సర్పంచ్ స్థానం జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. ఎనిమిది వార్డులు ఉండగా నాలుగు జనరల్, నాలుగు బీసీలకు కేటాయించారు. గ్రామంలో 990 ఓటర్లు ఉండగా ఒక్క వార్డు కూడా ఎస్సీలకు కేటాయించలేదు. ఈ గ్రామంలో ఎస్సీ ఓటర్లు లేరు.

» కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం బీసీ అభ్యర్థులకు కేటాయించారు. పది వార్డులు ఉండగా ఐదు జనరల్, ఐదు బీసీలకు కేటాయించారు. గ్రామంలో 2,625 ఓటర్లు ఉండగా ఈ గ్రామంలో కూడా ఒక్క వార్డు కూడా ఎస్సీలకు కేటాయించలేదు. ఈ గ్రామంలో ప్రస్తుతం 317 మంది ఎస్సీ ఓటర్లు ఉన్నారు. ఈ విషయంపై మొయినాబాద్ ఎంపీడీఓ సంధ్యారాణిని వివరణ కోరగా డెడికేట్ కమిషన్ ఇచ్చిన ఆదేశాలు.. గ్రామాల్లో ఉన్న జనాభా వివరాల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించినట్లు తెలిపారు. గతంలో ఉన్న ఎన్నికల నిబంధనల ప్రకారమే రిజర్వేషన్లు కల్పించినట్లు పేర్కొన్నారు.







వేములనర్వలో నామినేషన్ కేంద్రం వద్ద ముళ్ల కంచె వేసిన అధికారులు

## నామినేషన్ కేంద్రం ఎదుట ముళ్ల కంచె

కేశంపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వేములనర్వ, చింతకుంటపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు మండల పరిధిలోని వేములనర్వ పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలి. అయితే పంచాయతీ ముందు నుంచి వ్యవసాయ పొలాలకు పోయేదారితోపాటు ఎక్లాస్‌ఖాన్, బైర్కాన్‌పల్లికి వెళ్లే మార్గం ఉంది. నామినేషన్ కేంద్రం ముందు నుంచి కార్లు, పెద్ద వాహనాలు వెళ్లకుండా ఒకవైపు బారీకేడ్, మరోవైపు ముళ్లకంచెను ఏర్పాటు చేశారు. దీంతో ఈ మార్గంలో వెళ్లే గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

# కోడ్ కాలం.. జర పైలం

## పంచాయతీ ఎన్నికల వేళ జాగ్రత్తలు తప్పనిసరి

ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు.. నిఘా బృందాల ఏర్పాటు



చేవెళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) అమలులోకి వచ్చింది. అన్ని పార్టీల నాయకులు, పోటీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికలు జరగనున్న గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమలులో ఉంటుందని సంబంధిత ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుందని, తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

### హద్దు మీరితే అంతే..

ఎన్నికల సమయంలో పోటీ చేసే అభ్యర్థులు, అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులను సమానంగా చూడడంతోపాటు నిబంధనలు మీరకుండా పర్యవేక్షించేందుకు కోడ్ అమలు చేస్తారు. దీని కోసం మండలాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాధారణ ప్రచార సమావేశాలు, ఊరేగింపులు రోజువారీ కార్యకలాపాలు, పార్టీ కార్యక్రమాల పర్యవేక్షణ కోడ్ కిందకు వస్తాయి. ఎవరైన నిబంధనలు మీరితే చర్యలు తీసుకుంటారు.

### విధుల్లో నిర్లక్ష్యం వద్దు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మంత్రులు, అధికారిక పర్యటనలను ఎన్నికల ప్రచారంగా వినియోగించకూడదు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రభుత్వ వాహనాలు ఉపయోగించొద్దు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎవరైనా వ్యక్తిగత పర్యటనకు వచ్చిన సమయంలో అధికారులను పిలవొద్దు. ప్రజా ప్రతినిధులు పిలిచారని వెళ్లిన అధికారులపై నిబంధనల ఉల్లంఘనల కింద చర్యలు తీసుకుంటారు. అధికారంలో ఉన్న పార్టీలు సంక్షేమ పథకాల ముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రభుత్వ ఖర్చులతో ప్రచారం చేయొద్దు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రకటనలు, హోర్డింగ్‌లు వెంటనే తొలగించాలి. ఏదైనా పని మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలైనా కోడ్ ముగిసే వరకు ప్రారంభించడానికి అనుమతి ఉండదు.

### ప్రచారంలో జాగ్రత్తలివి..

ఎన్నికల ప్రచార సమయాన అభ్యర్థులు ప్రస్తుతం ఉన్న విబేధాలను తీవ్రతరం చేయటం, పరస్పర ద్వేషభావాన్ని పెంపొందించేలా వ్యవహరించొద్దు. పరస్పర విమర్శల సమయాన పార్టీ విధానాలకు, కార్యక్రమాలు, గత చరిత్రకు మాత్రమే కట్టుబడి ఉండాలి. నిరాధారమైన ఆరోపణలు చేయకూడదు. ఎన్నికల ప్రచారంలో ప్రార్థనా మందిరాలను వేదికకగా చేసుకోవద్దు. లౌడ్ స్పీకర్ల ఉపయోగానికి సైతం అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.



పన్నులు తీసుకుంటున్న పంచాయతీ సిబ్బంది

## పంచాయతీలకు జోరుగా ఆదాయం

ఎన్నికల వేళ నోడ్యూస్ కోసం అభ్యర్థుల బకాయిల చెల్లింపు

కొడంగల్ రూరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఎన్నికల నిబంధనల ప్రకారం సర్పంచ్, వార్డుసభ్యులుగా పోటీచేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఇతర పంచాయతీ బకాయిలు పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రంతోపాటు పంచాయతీ నుంచి పొందిన నోడ్యూస్ సర్టిఫికెట్ జతచేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు నోటిఫికేషన్‌తోపాటు గ్రామ పంచాయతీలకు బకాయిలు చెల్లించి నోడ్యూస్ ధ్రువపత్రాలు పొందుతున్నారు. పంచాయతీ సిబ్బంది శుక్రవారం పన్నులు స్వీకరించడంలో బిజీ అయ్యారు. కొడంగల్ మండలంలో 25 పంచాయతీలు ఉండగా అందులో హస్నాబాద్, రుద్రారం, అంగడిరైచూర్, రావులపల్లి నాలుగు మేజర్ పంచాయతీలు ఉన్నాయి.

## ఎన్నికలను బహిష్కరించిన 'బడుగోనిబావి'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బడిగోనిబావి గ్రామస్తులు

దౌల్తాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలం దేశాయిపల్లి అనుబంధ గ్రామం బడుగోని బావి గ్రామస్తులు పంచాయతీ ఎన్నికలను బహిష్కరించారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు రాస్తారోకోలు, ధర్నాలు చేసి నాయకులు, అధికారులకు వినతిపత్రాలు అందించినా ఇప్పటివరకు రోడ్డు సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ పరిధిలోని 8వ వార్డు బడుగోనిబావి ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు దౌల్తాబాద్ తహసీల్దార్ గాయత్రికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్ రెడ్డి సీఎం హోదాలో ఉన్నా చిన్న సమస్యను పరిష్కరించకపోవడం సరైంది కాదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో అనిల్, కృష్ణ, చంద్రప్ప, రవి, శ్రీను, మానప్ప, పాండు, చిన్నయ్య, షైపాల్, రవికుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాల తనిఖీ

తాండూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌతాపూర్ క్లస్టర్ కేంద్రంలో ఎన్నికల ప్రక్రియను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ చంద్రకిరణ్ పరిశీలించారు. శుక్రవారం గౌతాపూర్ పంచాయతీలో నామినేషన్ల ప్రక్రియను క్లస్టర్ ఇన్‌చార్జి సాయిబన్నను అడిగి తెలుసుకున్నారు. తాండూరు ప్రాంతంలో ఆరు మండలాల్లో పర్యటించానని, ఎన్నికల పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఎలాంటి తప్పులు జరుగకుండా నామినేషన్ పత్రాలను పరిశీలించిన తర్వాతనే ఎన్నికల అధికారికి అందజేయాలని సూచించారు. ఆయనవెంట తాండూరు ఎంపీడీఓ విశ్వ ప్రసాద్, ఏపీఓ, తదితరులు ఉన్నారు.



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ చంద్ర కిరణ్

## లింగంధనలో బీసీకి ఒకే ఒక్కటి..



కేశంపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పకడ్బందీగా కులగణన చేసినా బీసీ రిజర్వేషన్లలో గందరగోళం నెలకొంది. మండలంలోని లింగంధన గ్రామంలో 836 మంది ఓటర్లు ఉండగా, అందులో ఓసీలు 189, బీసీలు 389, ఎస్సీలు 252, ఎస్టీలు ఆరుగురు ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి రిజర్వేషన్లు ప్రకటించింది. ఇందులో భాగంగా గ్రామంలో సర్పంచ్, ఎనిమిది వార్డులకు రిజర్వేషన్లు కేటాయించింది. సర్పంచ్ పదవి ఎస్సీ జనరల్‌కు కేటాయించగా, వార్డుల్లో 2వ వార్డు ఎస్సీ జనరల్, 4వ వార్డు ఎస్సీ ఉమెన్, 8వ వార్డు ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. 3వ వార్డు జనరల్ ఉమెన్, 5వ వార్డు జనరల్ ఉమెన్, 6వది జనరల్, 7వది జనరల్‌కు కేటాయించారు. ఒకటవ వార్డు ఒక్కటే బీసీకి కేటాయించారు. 389 ఓటర్లు ఉంటే ఒక్క బీసీ స్థానం కేటాంచడంపై గ్రామంలోని బీసీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో బీసీలు ఉంటే ఒక్క స్థానంతో సరిపెట్టారని, ఇది బీసీలకు అన్యాయం చేయడమే ఆరోపిస్తున్నారు.

## ట్రావెల్స్ బస్సు, కారు ఢీ

» బస్సులోని 40మంది సురక్షితం

శంకర్‌పల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మహాలింగపురం వద్ద గురువారం అర్ధరాత్రి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, కారు ఢీకొన్నాయి. ప్రమాద సమయంలో బస్సులో 40మంది ఉండగా ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. లింగంపల్లి నుంచి శంకర్‌పల్లి మీదుగా ఆర్‌సీపురానికి వెళ్తున్న ట్రావెల్స్ బస్సును శంకర్‌పల్లి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో కారులో మంటలు చెలరేగి ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారును అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

## ఎయిర్‌హోస్టెస్‌తో ప్రయాణికుడి అసభ్య ప్రవర్తన

» నిందితుడిపై కేసు నమోదు

శంషాబాద్ రూరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో ఓ ప్రయాణికుడు మద్యం మత్తులో ఎయిర్‌హోస్టెస్‌తో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో శనివారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో నిందితునిపై కేసు నమోదైంది. దుబాయ్‌లో విమానం టేకాఫ్ తీసుకున్న తర్వాత భారత్‌కు చెందిన బినియమ్ నాజర్ అనే ప్రయాణికుడికి టీ ఇవ్వడానికి వెళ్లిన సమయంలో.. తన చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు పైలెట్‌కు సమాచారం అందించారు. విమానం శంషాబాద్‌లో ల్యాండ్ కాగానే భద్రతా సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ కనకయ్య తెలిపారు.

## షూటర్ ధనుష్ శ్రీకాంత్‌కు ఘన స్వాగతం



ధనుష్‌ను సన్మానిస్తున్న అధికారులు

శంషాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టోక్యోలో జరిగిన బధిర ఒలింపిక్స్‌లో రెండు స్వర్ణాలు సాధించిన హైదరాబాద్ షూటర్ ధనుష్ శ్రీకాంత్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం ఉదయం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న అతడికి శాట్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, గన్ ఫర్ గ్లోరి షూటింగ్ అకాడమీ (జీఎఫ్‌జీ) సిబ్బంది స్వాగతం పలికారు. ధనూష్ తండ్రి శ్రీకాంత్ మాట్లాడుతూ తన కొడుకు ఏళ్ల తరబడి చేస్తున్న కఠోర సాధనకు ఈ పతకాలు నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారానికి, జీఎఫ్‌సీలో ధనుష్ శ్రీకాంత్‌కు శిక్షణ ఇచ్చిన కోచ్ నేహాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాట్ కోచ్‌లు గోకుల్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు

## ఘనంగా పీఎంశ్రీ స్కూళ్ల స్పోర్ట్స్ మీట్

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సెయింట్ జ్యూడ్స్ స్కూల్‌లో జిల్లా స్థాయి పీఎంశ్రీ స్కూళ్ల స్పోర్ట్స్‌మీట్ ఘనంగా ప్రారంభించారు. జిల్లా స్థాయిలోని 27 పీఎంశ్రీ స్కూళ్ల నుంచి 867 మంది విద్యార్థులు పాల్గొంటుండగా శుక్రవారం పోటీలు ప్రారంభించారు. ఆదివారం వరకు పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ వంటి జట్టు క్రీడలతో పాటు అథ్లెటిక్స్ విభాగంలో లాంగ్ జంప్, షాట్ పుట్, 100 మీటర్ల రన్నింగ్ పోటీలను నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈక్రీడా మహోత్సవంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, అధికారులు, పీఈటీలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రీడా చైతన్యం పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం లక్ష్యమని అధికారులు తెలిపారు.

## కలెక్టరేట్‌కు ఆర్టీసీ బస్సు

» ప్రజలకు అందని సేవలు

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం నడవాల్సిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సును కొంత మంది కలెక్టరేట్ ఉద్యోగుల సౌకర్యార్థం వికారాబాద్ - హైదరాబాద్ మార్గంలో రోజూ నడుపుతున్నారు. దీంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం బస్సులు లేక సాధారణ ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటే ప్రత్యేక బస్సులో రోజూ 6 నుంచి 9 మంది మాత్రమే ప్రయాణిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఉదయం హైదరాబాద్ మెహదీపట్నం నుంచి కలెక్టరేట్‌కు వచ్చి సాయంత్రం 5.15కు తిరుగు ప్రాయాణం అవుతుంది. ఈ బస్సు సర్వీసుపై ఆర్టీసీ ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేసినా కలెక్టర్ పేరు చెబుతూ ఒత్తిడి తెస్తున్నారని, ముఖ్యంగా ఒక పరిపాలన అధికారి ఆర్టీసీ సిబ్బందిని భయపెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ స్నేహ మెహ్రా

» విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

» వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని 582 పంచాయతీల పరిధిలో 608 పోలీస్ లొకేషన్లలో ఏర్పాటు చేసిన 4,956 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతవాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. విధుల్లో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూరు డీఎస్పీ .యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నాపరాతి పరిశ్రమ అభివృద్ధికి కృషి

» తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతంలోని నాపరాతి పరిశ్రమపై వేలాది మంది కార్మికులు ఆధారపడి ఉన్నారని, పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరులో స్టోన్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్, తాండూరు మండల్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్లకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు పట్టణంలోని రాయల్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. తాండూరు స్టోన్ మర్చంట్ వెల్ఫేర్ అధ్యక్షుడిగా ఎంఏ నయీం, కార్యదర్శిగా మీర్జా ఫయాజ్ బేగ్ సంయుక్త కార్యదర్శి సంజీవ్ కుమార్, తాండూరు మండల క్వారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అబ్దుల్ రవూఫ్, కార్యదర్శిగా సయ్యద్ జుబేర్ పాషా, ట్రెజరర్‌గా మహమ్మద్ జైనోద్దిన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నాపరాతి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని, ఎప్పుడూ తాండూరు ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి మౌలిక సదుపాయల కల్పనకు పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఏడీ శంకర్ నాయక్, నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, ఓం ప్రకాష్ సోమని, శరణు బసప్ప, జుబేర్‌లాల, హర్షవర్ధన్‌రెడ్డి, కుంచం మురళి పాల్గొన్నారు.

## పాంబండ ఆలయ హుండీ లెక్కింపు

కులకచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ.1,71,536 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ షైపాల్ రెడ్డి, ఈవో బాలనర్సయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు ఈవో శాంతకుమార్, అర్చకులు దశరథం, పాండుశర్మ, కమిటీ సభ్యులు, సాంబశివ సేవా సమితి సభ్యులు, మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు


బీఆర్ఎస్‌లో చేరుతున్న పులుమద్ది నాయకులు

వికారాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి నాయకులు బీఆర్ఎస్‌లో చేరడంతో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ వారికి గులాబీ కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. పులుమద్ది గ్రామానికి చెందిన మాజీ వార్డుమెంబర్ బాలమణి, భాగ్యమ్మ, గొల్ల లక్ష్మి, వీరమణి, శ్రీవాణి, శ్రీలత, గొల్లపాపయ్య, గొల్ల శ్రీనివాస్, ఎర్రోళ్ల బీరయ్య, తూర్పు రవీందర్, గోపాల్, తూర్పు పాపయ్య, మల్లేశం, శ్రీనివాస్ రాజు నరేష్‌లు శుక్రవారం కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ విభాగం అధ్యక్షులు గయాజ్, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, నాయకులు భాస్కర్ పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు.

## ఆలయాన్ని వెంటనే పునర్నిర్మించాలి


ప్రతాప్‌సింగారంలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతాప్‌సింగారంలో తొలగించిన శ్రీశ్రీశ్రీ కంతమహేశ్వరస్వామి ఆలయాన్ని వెంటనే పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ నాయకులతో పాటు ప్రతాప్‌సింగారం గ్రామస్థులు, గౌడసంఘం నాయకులు ధర్నాకు దిగారు. కూల్చివేతకు కారణమైన పోచంపల్లి వాసుదేవరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాదాపు మూడుగంటల పాటు రోడ్డుపై బైఠాయించగా పోలీసులు రంగంలోకి దిగి వారిని సముదాయించి పంపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత ఏనుగు సుదర్శన్ రెడ్డి, నాయకులు బద్దం కుమార్, ప్రభాకర్‌గౌడ్, జున్ను స్వామిగౌడ్, సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


పరిగిలో జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా శుక్రవారం దోమ మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంతిరెడ్డి, శాంతకుమార్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

**పరిగి:** పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం పార్టీ శ్రేణుల సమక్షంలో జరుపుకున్నారు. ముందుగా పరిగిలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అక్కడే రామ్మోహన్‌రెడ్డి కేక్‌కట్ చేయగా, కార్యకర్తలు అభిమానులు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటి చైర్మన్‌లు పరుశరాంరెడ్డి, అంజనేయులు, ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కె.హన్మంత్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

## సైన్స్ ఫెస్టివల్‌కు ఉపాధ్యాయుడి ఎంపిక


రాచకొండ కార్తీక్

నవాబుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 6 నుంచి 9 వరకు చండీఘడ్‌లో జరిగే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఫెస్టివల్స్ శిక్షణ కార్యక్రమానికి ఎల్లకొండ పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయుడు రాచకొండ కార్తీక్ చారి ఎంపికయ్యారు. ఉపాధ్యాయుల వినూత్న బోధన విధానం, అనుభవం, వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం లాంటి అంశాలు పరిగణలోకి తీసుకొని ఎంపిక చేసినట్లు తెలిపారు. నవంబరులో హోమి బాబా సైన్స్ రీసెర్చ్ సెంటర్‌లోని బయాలాజీ ఒలంపియాడ్‌లో పాల్గొన్నట్లు తెలిపారు.

## డిగ్రీ కళాశాలలో అకాడమిక్ ఆడిట్

కొడంగల్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలకు గాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అకాడమిక్ ఆడిట్‌ను నిర్వహించారు. అకాడమిక్ అడ్వైజర్ తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత కుమారి చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రమేశ్‌బాబు హాజరయ్యారు. కళాశాల సిబ్బందికి వసంత కుమారి పలుసుచనలు చేశారు. అనంతరం అకాడమిక్ అడ్వైజర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, అకాడమిక్ కో- ఆర్డినేటర్ టి.రాంబాబు పాల్గొన్నారు.

## బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా రమేశ్‌గౌడ్

శామీర్‌పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ రాష్ట్ర నూతన కన్వీనర్‌గా శామీర్‌పేటకు చెందిన చింత రమేశ్‌గౌడ్ నియామకమయ్యారు. కాగా రమేశ్‌గౌడ్ ఇప్పటి వరకు బీసీ కార్మిక రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, బీసీజేఏసీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం శామీర్‌పేటలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్‌ను బీసీ జేఏసీ రాష్ట్ర నూతన కన్వీనర్‌గా నియమించి ఉత్తర్వు పత్రాన్ని కూడా తనకు అందజేసినట్లు రమేశ్‌గౌడ్ వివరించారు.

## అయ్యప్ప భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు

తాండూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో అయ్యప్ప భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఆంక్షలు విధించరాదని శుక్రవారం తాండూరు హిందూ సమాజం ప్రతినిధులు తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. డీజీపీ శివధర్‌రెడ్డి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగారం మల్లేష్, బంటారం భద్రేశ్వర్ పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

దోమ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అయినాపూర్‌లో మధుసూదన్ రెడ్డి అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ నాగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా అక్రమ లేఅవుట్

- కూల్చివేసినా మారని తీరు
- మరోసారి హద్దురాళ్లు ఏర్పాటు


ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చందుపట్లగూడలోని పులిచర కుంటలో వెలసిన ప్లాట్లు

ఘట్‌కేసర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రియల్టర్లు అక్రమ నిర్మాణాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు ప్లాట్ల హద్దురాళ్లను తొలగించినప్పటికీ హద్దురాళ్లు పాతడం, రోడ్లు వేయడం వంటివి చేస్తూ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఇదెక్కడో మారుమూల ప్రాంతంలో అనుకుంటే పొరపాటే. నగరానికి కూతవేటు దూరంలోని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చందుపట్లగూడలోని పులిచరకుంటలో జరుగుతున్న తతంగం. చెరువులు కుంటలు, బఫర్ జోన్లలో లేఅవుట్లుగాని నిర్మాణాలు గానీ చేపట్టవద్దని అధికారులు చెబుతున్నప్పటికీ రియల్టర్లు మాత్రం యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. పులిచరకుంటలోని ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్ చేసి ఏకంగా ప్లాట్లు సైతం విక్రయించారు. ఈ చెరువులో చేపట్టిన లేఅవుట్‌ను మున్సిపల్ అధికారులు పలుమార్లు కూల్చివేశారు. తాజాగా సెప్టెంబరు 4వ తేదీన హద్దురాళ్లను తొలగించారు. అయినప్పటికీ తిరిగి హద్దురాళ్లు పాతి ఏకంగా ప్లాట్ల నంబర్లు రాశారు. ఇది గమనించిన స్థానికులు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇంత జరుగుతున్నా అక్రమార్కులు చెరువుల్లో, బఫర్‌జోన్లలో యథేచ్ఛగా ప్లాట్లు చేసి అమాయక జనాలను మోసగించడంపై పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎప్పుడో మృతిచెందిన సర్పంచ్ సంతకాలు ఫోర్జరీ చేసి లేఅవుట్ రూపొందించి ప్లాట్లు విక్రయించి అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని చందు పట్లగూడ పులిచరకుంటలో అక్రమంగా లేఅవుట్ చేసిన విషయమైన గతంలోనే హద్దురాళ్లను తొలగించాం. తిరిగి హద్దురాళ్లు పాతిన విషయమై చర్యలు తీసుకుంటాం. చెరువులు, బఫర్ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవు.

- రాజేశ్, కమిషనర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

# మహనీయుడు జ్యోతిరావు పూలే

సమాజంలో సమానత్వం, విద్యా హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని పలువురు వక్తలు కొనియాడారు. మహాత్మా జ్యోతిరావుపూలే 135వ వర్ధంతిని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా పూలేకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పరిగి: పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


వికారాబాద్: జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు


తాండూరు: జ్యోతిరావుపూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

కులకచర్ల: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో నాయకులు




చౌడాపూర్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


శామీర్‌పేట: మాతృశ్రీ అనాథాశ్రమంలో జ్యోతిరావుపూలేకు నివాళులు


కొడంగల్: జ్యోతిరావుపూలే వర్ధంతిలో నాయకులు

# రెండో రోజు కొనసాగిన నామినేషన్ల ప్రక్రియ


యాలాల: జుంటుపల్లిలో నామినేషన్ దాఖలు చేస్తున్న వాణిశ్రీ

కొడంగల్ రూరల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండలంలో రెండోరోజు శుక్రవారం 19మంది సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులుగా 51 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో ఉషశ్రీ తెలిపారు. శనివారం(నేడు) నామినేషన్ల దాఖలుకు చివరిరోజు కావడంతో పెద్దఎత్తున నామినేషన్లు దాఖలు కానున్నట్లు తెలుస్తోంది.

**బషీరాబాద్:** మండలంలో 39గ్రామ పంచాయతీలకు గానూ రెండో రోజు 31నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో సంపత్‌కుమార్ తెలిపారు. 7 క్లస్టర్ల పరిధిలో 13 సర్పంచులు, 18 వార్డు సభ్యుల పదవులకు నామినేషన్లు వచ్చాయన్నారు.

**యాలాల:** మండలంలోని శుక్రవారం సర్పంచ్‌గా పోటీకి 25నామినేషన్లు, వార్డు సభ్యులుగా పోటీకి 27మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో శ్రీనిజ తెలిపారు.

**తాండూరు రూరల్:** మండలంలోని 33గ్రామ పంచాయతీల్లో ఎన్నికల అధికారులు 10 క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. వాటిలో శుక్రవారం రెండో రోజు నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. సర్పంచ్ స్థానాలకు 16, వార్డు సభ్యుడి స్థానానికి 42నామినేషన్లు దాఖలైనట్లు తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. మల్కాపూర్ క్లస్టర్ కేంద్రంలో సంగెం కలాన్ సర్పంచ్ స్థానానికి కామిని మీనాక్షి మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో కలిసి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు.

**బొంరాస్‌పేట్/దౌల్తాబాద్:** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డుసభ్యుల నామినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. మండలంలో సర్పంచ్ స్థానానికి 19నామినేషన్లు, వార్డు మెంబర్‌కు 48నామినేషన్లను అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఇప్పటి వరకు సర్పంచ్‌కు 26, వార్డు స్థానాలకు 49 నామినేషన్‌లను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. దౌల్తాబాద్ మండలంలో 29 సర్పంచ్, 55 వార్డు స్థానాలకు నామినేషన్‌లు స్వీకరించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

### నామినేషన్ల స్వీకరణకు 10 కేంద్రాలు

ధారూరు: మండలంలోని 34పంచాయతీల ఎన్నికల నామినేషన్లు స్వీకరించేందుకు 10 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు శుక్రవారం ఎంపీడీవో నర్సింహులు తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి నామినేషన్లు ఈ కేంద్రాల్లో స్వీకరిస్తామని ఆయన చెప్పారు. ధారూరు-1 జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ధారూరు, లక్ష్మినగర్ తండా, ధారూరు స్టేషన్, రాంపూర్ తండా, ధారూరు-2 రైతువేదికలో గట్టేపల్లి, హరిదాసుపల్లి, అల్లీపూర్, చింతకుంట, కేరెల్లి పంచాయతీ భవనంలో, కేరెల్లి, ఎబ్బనూర్, కొండాపూర్‌కుర్దు, మున్నూర్‌సోమారం నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. కుక్కింద గ్రామ పంచాయతీ భవనంలో కుక్కింద, ధర్మాపూర్, కొండాపూర్ కలాన్, అవుసుపల్లి, గడ్డమీది గంగారం ప్రాథమికోన్నత పాఠశాలలో గడ్డమీది గంగారం, నర్సాపూర్, రుద్రారం, నాగసమందర్ పంచాయతీ భవనంలో నాగసమందర్, అల్లాపూర్, గురుదోట్ల రైతువేదికలో గురుదోట్ల, అంపల్లి, పీసీఎం తండా, నాగారం జడ్పీహెచ్ఎస్‌లో నాగారం, దోర్నాల్, కుమ్మర్‌పల్లి, మోమిన్‌కలాన్ పంచాయతీ భవనంలో మోమిన్‌కలాన్, అంతారం, మోమిన్‌కుర్దు, రాజాపూర్, తరిగోపుల పంచాయతీ భవనంలో తరిగోపుల, నాగ్‌సాన్‌పల్లి, మైలారం పంచాయతీల నామినేషన్లు స్వీకరిస్తామని ఆయన చెప్పారు.

# నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలి


పెద్దేముల్ క్లస్టర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ చంద్రకిరణ్

పెద్దేముల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అభ్యర్థులు నామినేషన్లు వేసే సమయంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన వాటిని సరిచేసుకునే విధంగా వారికి సహకరించాలని డిప్యూటీ కలెక్టర్ చంద్రకిరణ్ అధికారులకు సూచించారు. మండలంలోని పెద్దేముల్, గాజీపూర్ క్లస్టర్లను ఆయన సందర్శించి నామినేషన్ రికార్డులను పరిశీలించారు. నామినేషన్‌కు అవసరమైన పత్రాల గుర్తించి పూర్తి విషయాలు వారికి ముందుగానే తెలపాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రతన్‌సింగ్, లాలప్ప ఉన్నారు.

### సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

వికారాబాద్: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడత నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయ ఎన్నికల అధికారి, వికారాబాద్ ఎంపీడీవో వినయ్ కుమార్ అన్నారు. వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ ప్రక్రియకు సంబంధించి సామగ్రిని ఎన్నికల సిబ్బందికి అందజేశారు.

**కులకచర్ల:** పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామాల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, స్టేజ్2 అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, స్టేజ్ 2 అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మోమిన్‌పేట్:** స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీడీవో సృజన సాహిత్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆర్‌వో, పీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈవో మల్లేశం, ఎంపీవో పాల్గొన్నారు.

### ఎన్నికల కోడ్ నిబంధనలను పాటించాలి

నవాబుపేట: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిబంధనలను పాటించాలని నవాబుపేట ఎస్సై పుండ్లిక్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సమావేశాలు, ర్యాలీలకు అనుమతి లేదన్నారు. ఎవరైనా గొడవలు సృష్టించినా, సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. రూ.50వేల కంటే ఎక్కువగా తీసుకెళ్తూ పట్టుబడినట్లయితే సీజ్ చేస్తామన్నారు. ఈ నెల 17 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు.

# కొనుగోళ్లలో జాప్యం.. దళారుల ఇష్టారాజ్యం

**మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవు**



జిల్లాలోని 14 కాటన్ మిల్లు ఉన్నాయి. వీటిలో ఇప్పకేటి 10 చోట్ల కొనుగోళ్లు ప్రారంభించారు. ఇంకా నాలుగు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంది. జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేశాం. అయితే ఇప్పటి వరకు 10 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. మరో వారం రోజుల్లో పత్తి కొనుగోళ్లు ఊపందుకుంటాయి.

- సారంగపాని, జిల్లా మార్కెటింగ్ అధికారి


(ఐదో పేజీ తరువాయి)

గురిచేస్తున్నారు. దీంతో రైతులు బయట మార్కెట్‌లో పత్తిని అమ్మడానికి ఆసక్తి చూపుతున్నారు. దొరికిందే చాన్స్ అన్నట్లు దళారులు పత్తి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. వారు చెప్పిన ధరకే పత్తిని విక్రయించాల్సిన పరిస్థితి. సీసీఐ కేంద్రాల్లో పత్తి క్వింటాలు రూ.8,110లుగా నిర్ణయించింది. కాగా బయట మార్కెట్‌లో మద్దతు ధర కంటే రూ.1000 నుంచి 2వేలు తగ్గిస్తూ దళారీలు రైతుల నుంచి పత్తిని సేకరిస్తున్నారు. ఈ కొర్రీల కారణంగా ఏటా జిల్లాలో దాదాపు 50 శాతం పత్తి దళారుల చేతుల్లోకే వెళ్తోంది. దీనికి తోడు మార్కెట్ కమిటీల పర్యవేక్షణ లేని కారణంగా జిన్నింగ్ మిల్లుల్లో పత్తి తూకాల్లో భారీ మోసాలకు పాల్పడుతున్నారు.

### నామమాత్రంగా నివేదికలు

ఈ సారి జిల్లాలో దాదాపుగా 2.55 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. ఈ సీజన్ మొదటి నుంచి వర్షాలు కురువకపోవడంతో విత్తనాలు ఆలస్యంగా విత్తారు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో అతివృష్టితో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాగా, పత్తి నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు సమర్పించిన నివేదికలు నామమాత్రంగా ఉండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపుగా లక్ష ఎకరాల్లో నష్టం జరిగితే అధికారుల మాత్రం యాభై వేల లోపు ఎకరాల్లో మాత్రమే నష్టం జరిగిందని చెబుతున్నారు. పత్తి సాగుకు అన్ని రకాలుగా అనుకూలిస్తే ఎకరాకు 12 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. కానీ ఈ సీజన్‌లో ఎకరాకు నాలుగు నుంచి ఆరు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు.

**కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలి**



సీసీఐ కేంద్రాల్లో పత్తి రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిబంధనల పేరుతో కొర్రీలు పెడుతున్నారు. నాణ్యత లేదని తక్కువ ధరకు కొంటామని చెబుతున్నారు. ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ.8,110 మద్దతు ధరను ప్రకటించి, కొనుగోళ్ళు ప్రారంభించినా దళాలరుకే మేలు జరుగుతోంది. ఎకరాలకు 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేసి మద్దతు ధర రూ.12 వేలకు పెంచాలి.

- అందె విజయ్‌కుమార్, కిసాన్ సంఘ్ రాష్ట్ర కన్వీనర్

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవాబుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన నవాబుపేట మండలంలో జరిగింది. ఎస్ఐ పుండ్లిక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరంపల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల మహేందర్‌రెడ్డి(40) శుక్రవారం బైక్‌పై మైతాప్‌ఖాన్‌గూడ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో చక్రంపల్లి వైపు వస్తున్న కారు మహేందర్ రెడ్డి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో పట్లోళ్ల మహేందర్‌రెడ్డికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతోట పోలీసుసిబ్బంది అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### భార్యను హత్యచేసిన భర్తకు జీవితఖైదు

పెద్దేముల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్యచేసిన భర్తకు జీవితఖైదు విధిస్తూ ప్రిన్సిపాల్ జిల్లా సెషన్స్‌జడ్జి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి తీర్పునిచ్చినట్లు పెద్దేముల్ ఎస్ఐ శంకర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పెద్దేముల్ మండలం బండపల్లికి చెందిన గుండెపల్లి/దంతపురం రవి తన భార్య సుజాతతో గొడవపడి 2016 సంవత్సరం జనవరి 2వ తేదీన గొడ్డలితో తన భార్యను ముఖం, మెడపై నరికి హత్యచేశాడు. అప్పట్లో పెద్దేముల్ ఎస్ఐగా విధుల్లో ఉన్న కృష్ణ, సీఐ సైదిరెడ్డిలు కేసు దర్యాప్తు చేశారు. ప్రస్తుతం సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ శంకర్‌లు ఈకేసులో విజయవంతంగా తీర్పువచ్చేలా కృషిచేశారు. ఈకేసును శుక్రవారం విచారణ చేపట్టిన ప్రిన్సిపాల్ జిల్లా సెషన్స్‌జడ్జి నిందితుడిని దోషిగా తేల్చి జీవితఖైదుతో పాటు రూ.5వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో ఒక సంవత్సరం పాటు కఠిన కారాగార శిక్ష ఉంటుందని తీర్పునిచ్చారు.

### విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం

మోమిన్‌పేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూలేని సమయంలో జరిగిన విద్యుదాఘాతంతో ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. ఎన్కెపల్లిలో కుమ్మరి లక్ష్మి వ్యవసాయ పనుల నిమిత్తం శుక్రవారం పొలం పనులకు వెళ్లగా ఇంట్లో నుంచి పొగలు వస్తున్నాయని స్థానికులు సమాచారం అందించారు. దీంతో ఇంటికి వచ్చి చూసేసరికి బీరువాలోని వస్తువులు, దుస్తులతో పాటు ఇంట్లోని నిత్యావసర సరుకులు కాలి బూడిదయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆర్ఐ సరిత ఘటనాస్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ప్రభుత్వపరంగా సాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

# లెక్క చెప్పాల్సిందే!

(ఐదో పేజీ తరువాయి)

అభ్యర్థులకు రూ.50 వేలుగా వ్యయ పరిమితి నిర్ణయించారు. ఐదు వేల కంటే తక్కువ జనాభా ఉన్న పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులకు రూ.1.50లక్షలు, వార్డు సభ్యుల అభ్యర్థులకు రూ.30 వేల కంటే ఎక్కువ ఖర్చు చేయకూడదని పరిమితి విధించారు.

### తేడా వస్తే వేటు తప్పదు

అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాల ఎన్నికల అధికారికి అందజేయాల్సి ఉంటుంది. ఫలితాలు వెలువడిన 45 రోజుల్లోగా అభ్యర్థులు ఎన్నికల్లో తాము చేసిన ఖర్చుల వివరాలను అధికారులకు అందజేయాలి. అభ్యర్థులు తమ ఖర్చులను నామినేషన్ పత్రాలతో పాటు అందజేసిన బ్యాంకు ఖాతాలోనే చూపించాలి. మండల కేంద్రాల్లోని ఎన్నికల వ్యయ పరిశీలకులు అభ్యర్థులు చేసిన ఎన్నికల ఖర్చులను పరిశీలించి ధ్రువపత్రం జారీ చేస్తారు. అధికారుల లెక్కలకు, అభ్యర్థులు చూపించిన లెక్కలకు సరిపోవాల్సి ఉంటుంది. లేకపోతే మూడేళ్ల పాటు ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించే అవకాశం ఉంటుంది.

## 'అనురాగ్'లో అంతర్జాతీయ టెక్నికల్ సమ్మిట్


జ్యోతిప్రజ్వలన చేస్తున్న రమణనాయక్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం అంతర్జాతీయ టెక్నికల్ సమ్మిట్ -2025 కార్యక్రమాన్ని ఐఈఐ, తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ ప్రొఫెసర్ రమణనాయక్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు విజయకుమార్, ముత్తారెడ్డి, సమ్మిట్ ఇన్‌చార్జి పల్లవి బద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

## తపస్ నియోజకవర్గ కార్యవర్గం ఎన్నిక

బొంరాస్‌పేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కొడంగల్ నియోజకవర్గంలోని 4 మండలాల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య ఆధ్వర్యంలో కొడంగల్ మండల అధ్యక్షుడిగా పృథ్వీసింగ్, ప్రధాన కార్యదర్శిగా నాగప్ప, బొంరాస్‌పేట్ మండల అధ్యక్షుడిగా బాకారం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, దౌల్తాబాద్ మండల అధ్యక్షుడిగా నాగేశ్, ప్రధాన కార్యదర్శిగా బసప్ప, దుద్యాల్ మండల అధ్యక్షుడిగా శంకరప్ప, ప్రధాన కార్యదర్శిగా తేజస్వినిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంగమేశ్, బాల్‌రాజ్, మొగులప్ప, శ్రీనివాస్, ఆశప్ప, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

**కొనసాగుతున్న పునఃప్రతిష్ఠాపన పూజలు**

తాండూరు రూరల్: అంతారంలో ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజులుగా పూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గణపతి పూజ, హోమంతో పాటు నాగదేవతలు, విగ్రహ ప్రతిష్ఠాపన వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం**

దోమ: జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గంజిపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ**

తాండూరు రూరల్: కొత్లాపూర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోతి గోపాల్ తల్లి రెండు రోజుల క్రితం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

**బడి బయటి పిల్లల సర్వే**

కులకచర్ల/దుద్యాల్: ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్‌రెడ్డి శుక్రవారం గ్రామంలోని సందని గడ్డ కాలనీలో బడి బయట ఉన్న పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఇద్దరు పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా దుద్యాల్‌లో సీఆర్‌పీలు రాందాస్, శ్రీనివాస్ సర్వే నిర్వహించి ఆరుగురు బడి బయటి పిల్లలను గుర్తించారు.

**42శాతం బీసీ రిజర్వేషన్ అమలేది?**

తాండూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ అమలేదని జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. జనరల్ స్థానాల్లో బీసీలకు ఎంత మంది మద్దతు ఇస్తున్నారో ఎమ్మెల్యేలు బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు బీసీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకునే బాధ్యత తీసుకోవాలని కోరారు.

**అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజాసేవే లక్ష్యం**

యాలాల: అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజాసేవే లక్ష్యమని హాజీపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. గ్రామానికి చెందిన కొండైపల్లి దేవమ్మ మనవరాలు పెళ్లి ఆదివారం జరగగా శుక్రవారం పుస్తె, మెట్టెలు అందజేశారు. ఐదు సంవత్సరాలుగా గ్రామంలో పెళ్లి జరిగిన వారి కుటుంబాలకు పుస్తె, మెట్టెలు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రవికుమార్ పాల్గొన్నారు.

**పోలీసుల వాహన తనిఖీ**

కులకచర్ల: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. ఎస్ఐ రమేశ్‌కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి శుక్రవారం మండలంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. పీఎస్ పరిధిలో తొమ్మిది సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని తెలిపారు.